సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం। 5। ఏప్రిల్। 2023



ఘనంగా పండిత సదస్యం


కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలో మంగళవారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. 8లో




ఉత్తమ ప్రదర్శనగా కొత్త పరిమళం

ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లిలో గొల్లపల్లి చెల్లయ్య నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. 8లో

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 6,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1850,మధ్య డెల్టాకు 1200,పశ్చిమ డెల్టాకు 3200 క్యూసెక్కులు వదిలారు.



న్యూస్‌రీల్

75.86 శాతం పింఛన్ల పంపిణీ



రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఉషారాణికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చంద్రకళ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రెండవరోజు మంగళవారం రాత్రి 6.30 గంటల వరకు 75.86 శాతం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ జరిగింది. జిల్లాలో 2,35,248 పింఛన్లకుగాను 1,74,346 మంది లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా రూ.49.16 కోట్లు పంపిణీ చేశారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీలో తూర్పు గోదావరి జిల్లా ఐదోస్థానంలో ఉంది. జిల్లాలో నిడదవోలు అర్బన్ 91.18 శాతంతో ప్రథమస్థానంలో ఉండగా, నల్లజర్ల మండలం 48.67 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. వలంటీర్లు ఆస్పత్రిల్లో చికిత్సపొందుతున్న లబ్ధిదారులకు స్వయంగా వెళ్లి అందజేశారు. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పరిధిలో 27వ డివిజన్ ఇన్నీసుపేటకు చెందిన గెళ్ల ఉషారాణి కణితి ఆపరేషన్ చేయించుకుని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ పితాని చంద్రకళ అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్‌ను అందజేసింది.

రేపటి నుంచి మహాకాళేశ్వర ఆలయం వార్షికోత్సవాలు



విలేకరులతో మాట్లాడుతున్న పట్టపగలు వెంకటరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట కైలాసభూమి సమీపంలో నిర్మించిన మహాకాళేశ్వరాలయం (మరో ఉజ్జయిని) ప్రారంభమై ఏడాది పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో గురువారం నుంచి ఈనెల 10వ తేదీ వరకూ ప్రథమ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు పట్టపగలు వెంకటరావు తెలిపారు. ఆలయ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉజ్జయినిలో ఆవుపేడతో చేసిన పిడకల భస్మంతో భస్మాభిషేకం చేస్తున్నారని, చితాభస్మంతో భస్మాభిషేకం చేస్తున్న దేశంలో ఏకైక ఆలయం రాజమహేంద్రవరంలోని మహాకాళేశ్వరాలయం అన్నారు.

త్వరలో మరిన్ని వసతులు

వెంకటరావు మాట్లాడుతూ మహాకాళేశ్వరాలయం ఆధ్వర్యంలో ప్రతిరోజు వంద మందికి పూర్తిస్థాయిలో ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసేలా ఆధునిక లేబొరేటరీ, అలాగే అర్చక పాఠశాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఒక గోశాలను నిర్మిస్తామని, త్వరలో మహాకాళేశ్వరాలయానికి ఏనుగులను తీసుకురానున్నామన్నారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. సమావేశంలో సెక్రటరీ తోట సుబ్బారావు, కోశాధికారి సీతారాం మహేశ్వరి, పట్టపగలు సూర్యప్రకాశరావు, అర్చకుడు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి భూసార పరీక్షా వారోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు భూసార పరీక్షా శిక్షణా వారోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో 10 నుంచి 12 వరకూ, మండల స్థాయిలో 13 నుంచి 15 వరకూ వ్యవసాయాధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లా వ్యవసాయాధికారిగా ఏడాది కాలం పూర్తి చేసుకున్న ఆయనను వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం సత్కరించింది. కార్యక్రమంలో ఏఈవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాధవరావు, ప్రచార కార్యదర్శి పీటర్, ఎం .నాగేశ్వరరావు, పీవీ శ్రీను, నానిబాబు, ఎస్‌పి శ్రీను, వాసు తదితరులు పాల్గొన్నారు.

లోపాలు సరి..
సాగుకు ఊపిరి

- ఆక్వా జోన్‌పై కొత్త గెజిట్
- కోల్పోయిన సర్వీసులకు విద్యుత్ రాయితీ పునరుద్ధరణ
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెరిగిన రాయితీ సర్వీసులు



ఆక్వా చెరువుకు విద్యుత్ సరఫరా



ఆక్వా చెరువులో ఏరియేటర్లు

జిల్లా	గతంలో రాయితీకి అర్హత ఉన్న కనెక్షన్లు	లేని కనెక్షన్లు	మొత్తం కనెక్షన్లు	తాజాగా రాయితీకి అర్హత ఉన్న కనెక్షన్లు	తాజాగా రాయితీకి అర్హత లేని కనెక్షన్లు	మొత్తం కనెక్షన్లు	అదనంగా రాయితీ పొందనున్న కనెక్షన్లు
తూర్పు గోదావరి	47	178	225	172	87	259	125
కాకినాడ	1,232	1,364	2,596	2,269	366	2,635	1,037
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	2,161	3,599	5,760	4608	1,276	5,884	2,447
మొత్తం	3,440	5141	8,581	7,049	1,729	8,775	3,609

సాక్షి అమలాపురం: ఆక్వా సంక్షోభంలో ఉన్నా రైతులు ధైర్యంగా సాగు చేస్తోంది విద్యుత్ రాయితీ ఉందనే నమ్మకంతోనే. కాని ఈ ఫిష్ సర్వేలో లోపాల కారణంగా సగం సర్వీసులకు రాయితీ విద్యుత్ కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీనిపై ఆక్వా రైతులు ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం స్పందించి లోపాలను సరిచేయాలని ఆదేశించింది. దీనితో అధికారులు మరోసారి సర్వే చేసి పొరపాటున్లు సరిదిద్దడంతో గతం కన్నా రాయితీ సర్వీసులు రెట్టింపు కానున్నాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 40 వేల ఎకరాల్లో వెనామీ సాగు జరుగుతోందని అంచనా. గత టీడీపీ హయాంలో విద్యుత్ రాయితీ యూనిట్‌కు రూ.2.50 ఉండగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్‌కు రూ.1.50 చేసింది. దీనివల్ల రైతులకు నెలకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడిని ఆదా చేసుకున్నారు. అయితే ఇటీవల మత్స్యశాఖ చేపట్టిన ఈ ఫిష్ సర్వేలో చోటు చేసుకున్న లోపాల వల్ల పలు సర్వీసులకు విద్యుత్ రాయితీలో కోత పడింది. సర్వేకు 2018 గెజిట్ నోటిఫికేషన్ పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఆ తరువాత కొత్తగా సాగు ఆరంభించిన చెరువులకు, ఆక్వాజోన్ పరిధిలో వచ్చిన చెరువులకు విద్యుత్ రాయితీ లేకుండా పోయింది. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లలేదు సరికదా, కొబ్బరి చెట్లు ఉంటే వాటిని ఉద్యాన పంటగా చూపించారు. భూముల క్రయ విక్రయాల వల్ల సబ్ డివిజన్ చేసిన చెరువుల సర్వే నంబరు మారితే దానిని నాన్ ఆక్వా జోన్‌గా చూపించారు. ఇలా రైతులు సగానికి పైగా సర్వీసులకు రాయితీని కోల్పోయారు. దీనివల్ల తమపై విద్యుత్ భారం పడుతోందని ఆక్వా రైతులు ఆందోళనకు దిగారు. దీనికి స్పందించిన ప్రభుత్వం లోపాలు సదిదిద్దాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. తొలుత గ్రామసభలు, తరువాత మండల లెవెల్ కమిటీ (ఎంఎల్‌సీ) సిఫారసు మేరకు డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ (డీఎల్‌సీ)ల ద్వారా ఆక్వాజోన్‌ను గెజిట్ చేసి హై లెవెల్ కమిటీ (హెచ్‌ఎల్‌సీ)కి పంపించారు. వారు ఇందుకు అంగీకరించి కొత్తగా విద్యుత్ రాయితీ ఇచ్చే సర్వీసుల జాబితాను ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్‌కు పంపుతూ ఫిషరీష్ కమిషనర్ కె.కన్నబాబు గత నెల 31న లేఖలు రాశారు.

రెట్టింపు సర్వీసులకు రాయితీ విద్యుత్

ఉమ్మడి జిల్లాలో గతంలో రాయితీ పొందిన సర్వీసులు కేవలం 3,440 సర్వీసులు కాగా, రాయితీ పొందని సర్వీసులు 5,141 కాగా, మొత్తం 8,581 సర్వీసులుగా గుర్తించారు. పొరపాట్లు సరిదిద్దిన తరువాత రాయితీ పొందే సర్వీసుల సంఖ్య 7,049కి పెరగగా, రాయితీ పొందని సర్వీసులు 1,729కు తగ్గాయి. మొత్తం మీద విద్యుత్ సర్వీసులు 8,775గా గుర్తించారు. ఈ- ఫిష్ సర్వే లోపాలను సరిదిద్దిన తరువాత తూర్పు గోదావరి జిల్లాలో 125, కాకినాడ జిల్లాలో 1,037, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,447 సర్వీసులకు అదనంగా రాయితీలు అందనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతం కన్నా అధిక సర్వీసులకు రాయితీ



ఈ-ఫిష్ సర్వే సమయంలో విద్యుత్ రాయితీ కోల్పోయిన సర్వీసుల కన్నా... రీ సర్వే చేసిన తరువాత రాయితీ పొందే సర్వీసులు పెరిగాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల 98 శాతం మాకు మేలు జరిగింది. కొంతవరకు రాంగ్ మ్యాపింగ్ జరిగింది. దీనిని కూడా సరిదిద్దుతామని మత్స్యశాఖ అధికారులు చెప్పారు. ప్రభుత్వానికి ఆక్వా రైతుల తరఫున ధన్యవాదాలు.

– త్సవటపల్లి నాగభూషణం, కోనసీమ ఆక్వారైతు పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు, చెయ్యేరు. కాట్రేనికోన మండలం.

మెట్లదారి భక్తులకు
శీఘ్రదర్శనం

- మే 1 నుంచి అమలుకు సన్నాహాలు



ఎండకు తాళలేక ఇబ్బంది పడుతున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధికి మెట్లదారిన వచ్చే భక్తులకు ఉచితంగా శీఘ్రదర్శనం కల్పించనున్నారు. ఇందుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతనెల 27 డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఒక భక్తుడు మెట్లదారి భక్తులకు ఉచిత శీఘ్ర దర్శనం కలిప్ంచేలా కూపన్లు ఇవ్వాలని కోరాడు. దీనిపై ఈఓ సానుకూలంగా స్పందించారు. అదే రోజు సాయంత్రం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రతిపాదించారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మే 1న జరగనున్న దివ్యకల్యాణ మహోత్సవం నాటికి శీఘ్రదర్శనానికి అనుమతించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మెట్లదారిలో షెడ్డు నిర్మాణానికి గ్రహణం

మెట్లదారిలో నీడ లేదు. ఈమార్గాన షెల్టర్ నిర్మించేందుకు మూడేళ్ల క్రితమే టెండర్లు పిలిచి ఓకే చేసినా పనులు ప్రారంభం కాలేదు. భక్తులు ఎండకు ఎండి వానకు తడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈఓ వీ త్రినాథరావు హయంగాలో షెడ్డుకు బదులు అలిపిరి–తిరుమల వెళ్లే మెట్లదారి తరహాలో తా షెడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. షెడ్డులో మంచినీటి సదుపాయం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. టెండర్ కూడా పిలిచారు. 2019లో రూ.32 లక్షలతో టెండర్ పిలవగా 26 శాతం తక్కువకు టెండర్ ఖరారైంది. దీనికి దేవదాయశాఖ కమిషనర్ 2020 ఏప్రిల్‌లో అనుమతి మంజూరు చేశారు. కోవిడ్–19 నిబంధనల కారణంగా దేవస్థానానికి భక్తులను అనుమతించలేదు. ఆ సమయంలో సంబంధిత కాంట్రాక్టర్ పని చేయడానికి ముందుకు వచ్చినా కోవిడ్ నిబంధనలు అడ్డంకిగా నిలిచాయి. మళ్లీ ఈ ఏడాది కూడా ఎండాకాలం వచ్చేసింది. షెల్టరు నిర్మాణం పనులపై స్పష్టత లేదు.

పథకాల అమలులో మెరుగైన ప్రగతి



భోజనం రుచి చూస్తున్న ఆనంద్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కేంద్ర ప్రభుత్వం బాలల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మెరుగైన ప్రగతిని చూపుతోందని నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ సభ్యుడు డాక్టర్ ఆర్‌జీ ఆనంద్ అన్నారు. జిల్లా పర్యటలో భాగంగా ఆయన మంగళవారం రాజమహేంద్రవరం మోషేవీధిలోని పాత ఉర్దూ పాఠశాలలో నిర్వహిస్తున్న అబ్జర్వేషన్ హోమ్‌ను తనిఖీ చేశారు. అనంతరం వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం నిధులు ద్వారా నిర్వహిస్తున్న వివిధ బాలల సంరక్షణా కేంద్రాలను తనిఖీ చేస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో రాజమహేంద్రవరం కేంద్రంగా బాలల, బాలికల సంరక్షణ నిలయాలు, జువైనల్‌హోమ్ భవనాల ఆధునీకరణ తదితర అంశాలకు సంబంధించి రూ.1.50 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు.. ఆయన వెంట ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కె.విజయకుమారి, డీసీపీవో వెంకట్, సీడబ్ల్యూసీ పి.మహాలక్ష్మి, హోం నిర్వాహకుడు పి.భాస్కర్ పాల్గొన్నారు.

జెనీవా ఎన్నికల బరిలో శ్రీపాద ఫణి ఓటమి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్విట్జర్లాండ్‌లో ఈనెల 2న జరిగిన జెనీవా గ్రాండ్ కౌన్సిల్ (అసెంబ్లీ) ఎన్నికల్లో రాజమహేంద్రవరం నివాసి, ప్రముఖ నటుడు, గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్ మిత్ర కుమారుడు శ్రీపాద ఫణి శాస్త్రి విజయం అంచుల దాకా వచ్చి ఆగిపోయారు. జెనీవా సిటీ స్థానం నుంచి గ్రీన్‌పార్టీ తరఫున పోటీ చేసిన ఆయన ఒపీనియన్ పోల్‌లో దూసుకుపోయారు. దీంతో లెబనాన్ ప్రత్యర్థి సెంటిమెంట్ కార్డుపైకి తీసి.. ఓ మైనారిటీని గెలిపించి మెజారిటీ మతానికి ద్రోహం చేయకండి అంటూ ప్రచారం చేశారు. అయినా విజయం ముంగిటకు వచ్చిన ఫణి 600 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఆ దేశంలో ఎన్నికల బరిలో నిలిచిన మొట్టమొదటి భారతీయుడిగా ఫణి చరిత్ర సృష్టించారు. యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీలో చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఫణి 20 ఏళ్లుగా స్విట్జర్లాండ్‌లో ఉంటున్నారు.

సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట

- హోం మంత్రి తానేటి వనిత
- ఎంపీ భరత్‌రామ్‌తో కలసి మహిళా సంఘాలకు ఆసరా చెక్కు అందజేత



చాగల్లులో డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్

చాగల్లు: మహిళా సాధికారతే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కును చాగల్లులోని తెలగా సంఘ కల్యాణ మండపం వద్ద మంగళవారం మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. కార్యక్రమానికి మంత్రి వనిత, రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి వనిత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా మహిళల రుణాలను, బంగారంపై రుణాలను మాఫీ చేస్తానని చెప్పి మోసగించారని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికలు వస్తున్నందున విపక్షాలు పలు ప్రలోభాలకు పెడతాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని ఆమె కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ రుణాలు, వైఎస్సార్ ఆసరా, ఇళ్లపట్టాలు, రుణమాఫీ, అమ్మఒడి వంటి అనేక పథకాలను అమలు చేస్తోందని మంత్రి అన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద చాగల్లు మండలంలోని 1235 పొదుపు సంఘాలకు మూడో విడతలో రూ.11.13 కోట్ల రుణ మాఫీ సొమ్ము విడుదల అయ్యిందన్నారు. ఈ మొత్తానికి నమూనా చెక్కును మంత్రి వనిత, ఎంపీ భరత్ లబ్ధిదారులకు అందజేశారు.

ప్రజల సుఖసంతోషాల కోసమే..

ఎంపీ భరత్‌రామ్ తన ప్రసంగంలో మాట్లాడటం కూడా సరిగ్గా రాని నారా లోకేష్ లాంటి అసమర్థుడి చేతిలో రాష్ట్ర భవిష్యత్తును పెట్టే స్థితిలో ప్రజలు లేరన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. మంత్రివర్గంలో కీలకమైన హోం శాఖను మహిళలకే కేటాయించి మహిళలకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో మంత్రి వనిత, ఎంపీ భరత్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీలు జుజ్జువరపు రామచంద్రరావు, చెల్లింకుల శ్రీ విజయ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఆత్మ చైర్మన్ గంధ్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఏపీఎం మంగాయమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జిల్లాల విభజనతో దగ్గరైన పాలన

- హోంమంత్రి తానేటి వనిత
- ఘనంగా జిల్లా ఆవిర్భావ దినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు



ప్రతిజ్ఞ చేస్తున్న హోంమంత్రి వనిత, ఎమ్మెల్యే రాజా, షర్మిలారెడ్డి, ఆకుల వీర్రాజు, కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో చేసిన జిల్లాల విభజనతో అభివృద్ధి పరుగులు పెడుతోందని, ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత అందుబాటులోకి వచ్చిందని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం స్థానిక ఆనం కళాకేంద్రంలో జిల్లా ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాల ఆవిష్కరణ సత్ఫలితాలు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల ఏర్పాటు ద్వారా పాలనా వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. చిన్న జిల్లాల ఏర్పాటు దిశలో రాజమహేంద్రవరం కేంద్రంగా 19 మండలాలతో నూతన తూర్పుగోదావరి జిల్లా ఏర్పాటు చేశారన్నారు. గత ఏడాది ఇదే రోజున జిల్లా తొలి కలెక్టర్‌గా మాధవీలత బాధ్యతలు చేపట్టారని, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. పాలనా పరంగా కలెక్టర్ మాధవీలత, భద్రతాపరంగా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారని అభినందించారు.

సమన్వయంతో ముందడుగు

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం సాధించడం ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళుతున్నామన్నారు. ఎస్పీ సుధీర్ కుమార్, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ సహకారం అభినందనీయమన్నారు. గత ఏడాది ఎదుర్కొన్న సమస్యలను అధిగమించి ముందుకు అడుగులు వేస్తున్నామన్నారు. జిల్లాలో పారిశ్రామిక పరంగా, పర్యాటకంగా ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజమహేంద్రవరం ఎంపీ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల నుంచి ఎంతో సహకారం లభిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచేందుకు ఇదే తరహాలో సహకారం కొనసాగించాలని కోరారు. జిల్లాను మద్యపాన, మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దే క్రమంలో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లాలోని వందమంది ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు రూ.3.56 కోట్ల సబ్సిడీతో కూడిన బ్యాంకు రుణాలు అందించడం ద్వారా నూతన పారిశ్రామిక అభివృద్ధి దిశగా అడుగులు వేయడం జరిగిందన్నారు.

సుపరిపాలన కోసమే..

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే క్రమంలో నియోజకవర్గ స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజాసమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కలెక్టర్ మాధవీలత చొరవ తీసుకున్నారన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి, ఐటీడీఏ పీఓ ప్రవీణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ట్రైనీ ఐపీఎస్ పంకజ్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ముందడుగు

రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ నూతనంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏర్పడిన అనతి కాలంలోనే తన నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన కలెక్టర్, ఇందుకు అన్నివిధాలా అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన జాయింట్ కలెక్టరు ఎన్.తేజ్ భరత్ జిల్లా అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేయించారు.

ఆకట్టుకున్న ఫొటో ప్రదర్శన

జిల్లాలో ఏడాదిగా జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, రాజమహేంద్రవరం గొప్పతనాన్ని తెలిపేలా చారిత్రక ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు. వీటిని హోంమంత్రి, కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు తిలకించారు. సుబ్రహ్మణ్యం మైదానంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారు, ఐసీడీఎస్ స్టాళ్లను, ఆవరణలో ముగ్గులను ముఖ్యఅతిథులు పరిశీలించి అభినందనలు తెలిపారు. ఐసీడీఎస్ స్టాల్‌లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలను రుచి చూశారు.

క్లుప్తంగా

గజ్జరంలో వాలీబాల్ టోర్నీ ప్రారంభం

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొంటున్నాయని గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, యూత్ సభ్యులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు, తృతీయ బహుమతిగా రూ.3 వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభని శ్రీహరి, సిర్రా గంగారావు, డెంటల్ డాక్టర్ సాగర్, యూత్ సభ్యులు మల్లిపూడి కిషోర్, మర్లపూడి అచ్చిబాబు, మల్లిపూడి బాబ్జీ పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఏపీపీఎస్సీ కమిషన్ ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు సంబంధించిన గ్రూప్ – 4 ప్రధాన రాత పరీక్షలు మంగళవారం రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో జరిగాయి. రెండు పూటలా నిర్వహించిన పరీక్షలకు 487 మంది వంతున హాజరయ్యారని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు.

క్రీడాశిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం): శాప్ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి 31 వరకూ వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 8వ తేదీలోపు ఈజీడీఎస్ఏ రాజమహేంద్రవరంఎట్‌జీమెయిల్.కామ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా పండిత సదస్యం


స్వామివారికి సదస్యం నిర్వహిస్తున్న వేద పండితులు


ప్రత్యేక అలంకరణలో శ్రీ వేంకటేశ్వరస్వామి

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి క్షేత్రం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయంలో మంగళవారం పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేకువ జామునే గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ అచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు వేదపారాయణ చేశారు. సుప్రభాత సేవ, బాలబోగం, విష్వక్సేన పూజ, వేద పారాయణ, నివేదన, బలిహరణ దివ్య ప్రబంధన కార్యక్రమాలను వేద పండితులు, అర్చక స్వాములు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. స్వామివారిని ఆభరణాలతో అలంకరించి మిరమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పవళింపు సేవ చేశారు. అనంతరం పవళింపు సేవ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు మాట్లాడుతూ బుధవారం తెప్పోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.


విజేతలకు కప్ అందిస్తున్న కర్రి భామిరెడ్డి, ద్వారంపూడి వీరభద్రారెడ్డి తదితరులు

90 ప్లస్ బ్యాడ్మింటన్ టోర్నీ విన్నర్స్ రామకృష్ణ, జగన్

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 90 ప్లస్ మాస్టర్స్ ఇన్విటేషన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విన్నర్స్‌గా కాకినాడకు చెందిన రామకృష్ణ, తునికి చెందిన జగన్ నిలిచారు. స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 90ప్లస్ బ్యాడ్మింటన్ టోర్నీలో 30 జట్లు పాల్గొన్నాయి. పోటీలలోని విజేతలకు బ్యాడ్మింటన్ సంఘ కాకినాడ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, మాజీ అధ్యక్షుడు చుండ్రుగోవింద రాజు, బ్యాడ్మింటన్ సంఘ నాయకులు కర్రిభామిరెడ్డి, వర్మ, శ్రీనివాసులురెడ్డి బహుమతులు అందజేశారు. ఈ టోర్నీలో రన్నర్స్‌గా గణేష్–రంగా జట్టు, తృతీయస్థానంలో సాయి–రాజ్‌కిరణ్, రమణ–సునీల్ జట్లు నిలిచాయి.

రత్నగిరి రోజువారీ పంచాంగం రూపకల్పన


అధికారులు విడుదల చేసిన పంచాంగం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ముందు రోజు వారం, తిథి, నక్షత్రం, అమృతకాలం, దుర్ముహూర్తాలతో కూడిన రోజువారీ పంచాంగం రూపొందించారు. ఈ పంచాంగాన్ని ప్రతీ రోజు సాయంత్రం ఆరు గంటలకు దేవస్థానం అధికారిక గ్రూప్‌తో బాటు, మీడియా గ్రూప్, ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తున్నారు. ఇందులో ఆరోజు స్వామివారికి వచ్చిన ఆదాయం, వ్యయం, ముందు రోజు జరిగే ఉత్సవాల వివరాలు కూడా పొందుపరుస్తున్నారు. ఇది భక్తులకు చాలా సౌకర్యవంతంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంగళవారం సాయంత్రం విడుదల చేసిన పంచాంగంలో దేవస్థానానికి ఈరోజు రూ.11,23,060 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. శ్రీరామనవమి నవరాత్ర ఉత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం శ్రీసీతారాముల వనవిహారోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా కొత్త పరిమళం


రెండు నిశ్శబ్దాల మధ్య నాటికలో సన్నివేశం


ఉత్తమ ప్రదర్శన కొత్త పరిమళం నాటికకు అవార్డు అందుకుంటున్న కళాకారులు

ముగిసిన రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో రామాలయం నిర్మించి వందేళ్లు కావడంతో పాటు శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గొల్లపల్లి చెల్లయ్య మెమోరియల్ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు సోమవారం రాత్రి ముగిసాయి. కళాపరిషత్ అధ్యక్షుడు, ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి(బుజ్జి) ఆధ్వర్యంలో ఐదురోజులపాటు ఆసక్తికరంగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో కొత్త పరిమళం నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. బోరిలంక వారి శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవాసంఘం ఆధ్వర్యంలో కొత్త పరిమళం నాటిక ప్రదర్శించారు. దీనికి బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించగా కేకేఎల్‌స్వామి రచన అందించారు. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా రెండు నిశ్శబ్దాల మధ్య, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా అందిన ఆకాశం నగదు పురస్కారాలు అందుకున్నాయి. ఉత్తమనటుడిగా ఎస్ఎం బాషా(అందిన ఆకాశం), ఉత్తమ నటిగా టి.లక్ష్మి (రెండు నిశ్శబ్దాల మధ్య), ఉత్తమ దర్శకుడిగా ఎస్.రవీంద్రరెడ్డి(రెండు నిశ్శబ్దాల మధ్య) ఎంపికయ్యారు. చివరిరోజు గుంటూరు వారి అభినయ ఆర్ట్స్ రెండు నిశ్శబ్దాల మధ్య నాటిక ప్రదర్శించగా శిష్టాల చంద్రశేఖర్ రచన అందించారు. విజయవాడ వారి మైత్రి కళానిలయం వారు ఇతిహాసం నాటిక ప్రదర్శించారు. దీనికి దర్శకత్వం టీవీ పురుషోత్తమ్ వహించగా రావు కృష్ణారావు రచన అందించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేకల హనుమంతరావు, భక్తి చానల్ సలహాదారు అడపా నాగదుర్గారావు, పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

కొవ్వూరు: రెండు రోజుల నుంచి ఎస్ఈబీ అధికారులు అనధికారిక మద్యం దుకాణాలు (బెల్టుషాపులు) నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. పశివేదల గ్రామంలో భీమడోలు సరోజిని అనే మహిళ వద్ద 18 క్వార్టర్ మద్యం బాటిళ్లను, ఐ.పంగిడిలో మాచవరపు కాశీ అనే వ్యక్తి వద్ద 12, తోగుమ్మిలో కాళ్ల సూరిబాబు వద్ద 17, మద్దూరులో పిల్లి బంగారమ్మ వద్ద 36, చాగల్లులో దసన బోయిన కృష్ణబాబు అనే వ్యక్తి వద్ద 20 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్..

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మండపేట: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం సాయంత్రం పట్టణంలోని గొల్లపుంత కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన బీవీవీ సత్యనారాయణ (37) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం మోటార్ ఆన్‌చేసి బకెట్‌లోకి నీరు పడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు అతనిని వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్‌బాబా, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మోటారు సైకిల్ దొంగతనం కేసులో 6 నెలల జైలు

పిఠాపురం: మోటారు సైకిల్ దొంగతనం చేసిన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం ప్రకారం 2022వ సంవత్సరం ఆగస్టు 11వ తేదీన పిఠాపురానికి చెందిన ఒక వ్యక్తి తన కుమారుడికి ఒంట్లో బాగోలేక పోవడంతో మోటారు సైకిల్‌పై భార్యతో కలిసి కొడుకుని తీసుకుని పిఠాపురంలోని ఉప్పాడ సెంటర్లో ఉన్న ఒక ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాడు. మోటారు సైకిల్‌ను ఆస్పత్రి ఎదుట నిలిపి ఆస్పత్రిలోకి వెళ్లాడు. పని పూర్తయ్యాక బయటకు వచ్చి చూడగా తన మోటారు సైకిల్ కనిపించలేదు. దీంతో 19 సెప్టెంబర్ 2022న పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం చిన కాపవరానికి చెందిన కుప్పల ఏసు, అలియాస్ రమేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. ముద్దాయిపై మోపిన నేరం రుజువు కావడంతో పిఠాపురం జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి ఎం.సుధారాణి ముద్దాయికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బాలికపై ఇంటర్ విద్యార్థి లైంగిక వేధింపులు

రాజోలు: పదేళ్ల బాలికపై ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న యువకుడు లైంగిక దాడి చేసిన ఘటనపై మంగళవారం కొత్తపేట డీఎస్పీ కె.వి.రమణ చింతలపల్లిలో విచారణ నిర్వహించారు. ఇంట్లో తల్లిదండ్రులు, ఎవరూ లేని సమయంలో వరసకు బాబాయి అయిన ఇంటర్ విద్యార్థి ఐదో తరగతి చదువుతున్న 10 ఏళ్ల బాలికను లైంగిక వేధింపులకు గురి చేశాడు. రాజోలు మండలం చింతలపల్లి గ్రామంలో ఈ దారుణం చోటు చేసుకుంది. లైంగిక దాడి విషయాన్ని ఎవరికైనా చెబితే బాలికను చంపేస్తానని ఇంటర్ విద్యార్థి బెదిరించి పదేపదే లైంగికంగా దాడి చేశాడు. తన కుమార్తెకు జరిగిన ఘాతుకాన్ని తల్లి చిన వెంకటలక్ష్మి తెలుసుకుని స్థానిక పెద్దలకు చెప్పింది. ఈ ఘాతుకానికి పాల్పడిన యువకుడికి బుద్ధి చెప్పాలని వేడుకుంది. అయితే పెద్దలు చేతులెత్తేయడంతో తల్లి చిన వెంకటలక్ష్మి రాజోలు పోలీసులను ఆశ్రయించింది. తల్లి ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్సై కృష్ణమాచారి కేసు నమోదు చేయగా కొత్తపేట డీఎస్పీ కె.వి.రమణ చింతలపల్లి గ్రామంలో బాధిత బాలికతో పాటు ఆమె తల్లిదండ్రుల వద్ద నుంచి వివరాలు సేకరించారు. ఈ ఘాతుకాన్ని పాల్పడిన ఇంటర్ విద్యార్థిని అరెస్ట్ చేస్తామన్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

మలికిపురం: మండల పరిధిలోని గుడిమెళ్ళంకలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 23 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై హరికోటి శాస్త్రి మంగళవారం చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

చోరీ సొత్తు రికవరీ

రామచంద్రపురం: గత నెల 27వ తేదీన పట్టణంలోని ఉనుపులవారివీధిలో ఒక ఇంట్లో చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై డి.సురేష్ బాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని ఉనుపులవారీ వీధికి చెందిన దాసరి వీరవెంకట సత్యనారాయణ ఈ నెల 27న ఇంటికి తాళం వేసి హాస్పిటల్ పని నిమిత్తం కోలంక గ్రామం వెళ్లగా ఆ రోజు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి చొరబడి మూడు కాసుల బంగారం రూ.5,500 నగదు దొంగిలించుకుపోయారని ఎస్సై సురేష్ బాబు తెలిపారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ వి.దుర్గారావు నేతృత్వంలో దర్యాప్తు చేయగా పట్టణంలోని గుబ్బలవారిపేటకు చెందిన కంచే సూర్యమణికంఠ, ఖండవల్లి కిరణ్‌లుగా గుర్తించి ఇరువురిని మంగళవారం కొత్తూరు జంక్షన్‌లో అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి దొంగిలించిన సొత్తును మొత్తం స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చోరీ దారులను గుర్తించటంలో కీలక పాత్ర వహించిన ఎస్సై సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ వీరబాబు, కానిస్టేబుల్స్ జగదీష్, సూరిబాబు, హోం గార్డులు రామకృష్ణ మహేష్‌ను ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

బాణసంచా షాపులో అగ్ని ప్రమాదం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు


మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

పెదపూడి: స్థానిక కృపా ఫైర్ వర్క్సు షాపులో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాసు, తహసీల్దార్ టి.సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...పెదపూడి గ్రామంలో కొంతకాలంగా కృపా ఫైర్‌వర్క్సు పేరుతో బాణసంచా తయారు చేసే షాపును డి.శ్రీను నిర్వహిస్తున్నాడు. మంగళవారం శ్రీనుతోపాటు మరో నలుగురు అక్కడ పని చేస్తున్నారు. షాపునకు సంబంధించి మూడు షెడ్లు దూరం, దూరంగా ఉన్నాయి. మధ్యాహ్నం శ్రీనుతో సహా మరో ఇద్దరు భోజనం చేసి సమీపంలోని చెట్ల కిందకు సేద తీరడానికి వెళ్లారు. సామర్లకోటకు చెందిన డొకుబుర్ర రాజు, పల్లపాటి శేషారావు షెడ్డులో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మంటలు ఎగిసిపడ్డాయి. మొదట ఒక షెడ్డులో ఏర్పడిన మంటలు దూరంగా ఉన్న మరో షెడ్డుకు వ్యాపించి సరకు కాలిపోయింది. ఈ మంటల్లో రాజు, శేషారావు చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో వారి శరీరాలు కాలిపోగా బయటకు పరుగులు తీశారు. ఈ ప్రమాదంతో ఆందోళన చెందిన నిర్వాహకుడు డి.శ్రీను షెడ్డు దగ్గరకు వస్తుండగా అతనికి మంటలు అంటుకుని గాయాలయ్యాయి. ప్రాణభయంతో వారు పరుగులు తీస్తుండగా గమనించిన స్థానికులు వారిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ సూపరింటెండెంట్ పి.సుజాత ఇతర వైద్యులు అత్యవసర వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శేషారావు (35) రాత్రి మృతిచెందాడు. కాకినాడ ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసు తహసీల్దార్ టి.సుభాష్, ఎస్సై పి.వాసు, ఆర్ఐ.ఎం.త్రివేణి ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం


కాత్రావులపల్లిలో పీడీఎఫ్ బియ్యం పట్టుకున్న అధికారులు

జగ్గంపేట: కాత్రావులపల్లిలో విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 45 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ అందించిన వివరాల ప్రకారం.. కాత్రావులపల్లి వెంగయ్యమ్మపేట డోర్ నంబర్ 12–98లో చిట్టిడి అమ్మన్న అనే తాతాజీ 22.50 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం 45 బస్తాలలో అక్రమంగా నిల్వ చేశారు. వాటిని స్వాధీనం చేసుకొని, అతనిపై సివిల్ సప్లయిస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి, పోలీసులకు అప్పగించామని తెలిపారు. తాతాజీ జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురం పరిసర ప్రాంతాల్లో చౌక ధరల బియ్యాన్ని కార్డుదారుల నుంచి రూ.16లకు కొనుగోలు చేసి మోటారుసైకిల్‌పై తెచ్చేవాడు. ఆ బియ్యాన్ని రూ.18 పరిసర ప్రాంతాల్లోని చేపల చెరువులకు విక్రయించేవాడు. కాత్రావులపల్లిలో స్వాధీనం చేసుకున్న బియ్యానికి ఎటువంటి బిల్లులు లేనందున వాటిని సీజ్ చేశామని, వీటి విలువ రూ.95 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ పీవీ రవికుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాలో పీడీఎస్ (చౌక ధరల బియ్యం) అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, ఎవరైనా పీడీఎస్ బియ్యం కొనడం , అమ్మడం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్, తహసీల్దార్ విజయకుమార్, జగ్గంపేట సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత.. వ్యక్తి అరెస్ట్

యానాం: యానాం పట్టణ పరిధిలో నిషేధిత గుట్కా ప్యాకెట్లు అమ్ముతున్న వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ శేరు నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక దొంతాబత్తులవారి వీధిలోని ఓ గొడౌన్‌లో నిషేధిత గుట్కా ప్యాకెట్లు అమ్మకాలు సాగిస్తున్న వంకాయల రామ్మూర్తి అనే వ్యాపారిని పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రూ.56,400 విలువజేసే 54 కేజీల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ముమ్మిడివరం: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ గంటా వారి వీధికి చెందిన మానేపల్లి నాగేంద్ర మద్యం బాటిల్స్ తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ సీహెచ్ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడి చేశారు. నాగేంద్రను అరెస్ట్ చేసి, అతడి నుంచి 180 ఎంఎల్ 80 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.